ట్రాఫిక్ సమస్యకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి


రద్దీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. వివేకానందనగర్, సప్తగిరి కాలనీ, భాష్యం స్కూల్‌వద్ద ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్యతో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల రద్దీ వల్ల ఉదయం, సాయంత్రం రహదారులు నిత్యం రద్దీగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, ఎస్ఐ రమేష్, గోపాల్, కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, శర్మ, ఎల్లం నాయుడు, వినోద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2కి చెందిన ఓం ప్రకాష్‌కు మంజూరైన రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డి పాల్గొన్నారు.

క్యూరింగ్ చేసి అందుబాటులోకి తేవాలి

ఆల్విన్‌కాలనీ: పనులు పూర్తైన సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. విజయనగర్ కాలనీలో రూ. 80 లక్షలతో రోడ్డు నెంబర్ 1లో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దుకోవాలని కాలనీ ప్రజలకు సూచించారు.


విజయనగర్‌లో సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

మ్యాన్‌హోల్ కవర్ ఏర్పాటు చేయాలి

ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో ఉన్న ఓపెన్ నాలాపై మ్యాన్‌హోల్ కవర్ పగిలి ప్రమాదకరంగా ఉందని స్థానికులు కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే మ్యాన్‌హోల్ కవర్ ఏర్పాటు చేయాలని, చెత్తా చెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, ఫారూఖ్, సత్యనారాయణ, మురళీ కృష్ణమోహన్, లింగారెడ్డి, బషీర్, మహేష్, ఖలీం, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సూపర్ వైజర్ శివ పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం


అల్పాహారం అందజేస్తున్న కోటిరెడ్డి తదితరులు

మోతీనగర్: లయన్స్ క్లబ్ సనత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు మంగళవారం అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ టీ 20 డీ పర్యావరణ ప్లాస్టిక్ నివారణ చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని నగరంలోని రోగులకు, అభాగ్యులకు, అనాథలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఘట్టమనేని బాబూరావు, అమరేందర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, పీసీ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్యులు

మోతీనగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీనగర్‌లో బాలానగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో బీపీ, మధుమేహం, గొంతు, ముక్కు, చెవులు, దంత, చర్మ, కాళ్లతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేపట్టాలి


మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మరమ్మతు పనులు పూర్తి చేసి, నీటి సరఫరాకి ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, ప్రగతి నగర్‌లో మంజీర పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను, ట్రాఫిక్ మళ్లింపును కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకట్, జలమండలి అధికారులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా క్షేత్ర స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. జేఎన్‌టీయూ ప్రధాన రహదారి నుంచి అడ్డగుట్ట, హెచ్‌ఎంటీ హిల్స్, ఆదిత్య నగర్ మీదుగా ప్రగతి నగర్‌కు నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయన్నారు. మంజీరా పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులను కోరారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీసీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, ఇంజినీరింగ్ అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు రాజేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ పార్కు వద్ద చేపడుతున్న ప్రహరీ నిర్మాణ పనులను అధికారులు, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ శ్రీనివాసరావు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పార్కులో నెలకొన్న సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజేందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, సుబ్బారావు, కిషోర్‌బాబు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ


ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ప్రతినిధులు, మహిళలు

సుభాష్‌నగర్: నిర్మాణ్, మైండ్‌స్పేస్ సంస్థల ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణను అందిస్తున్నామని నిర్మాణ్ సంస్థ మేనేజర్ ఆదర్శ్ పేర్కొన్నారు. బహదూర్‌పల్లి చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ పొందిన 60 మందితో కలిసి 30 చెట్లను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన పలువురికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని, మహిళలు సాధికారత సాధించేదిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య , ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు మంజునాథ్, భీంరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

- వెదజల్లుతున్న దుర్వాసన
- వాహనదారులు, కాలనీ వాసులకు ఇబ్బందులు
- లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు





ఆల్విన్‌కాలనీ: తరచూ డ్రైనేజి పొంగి పొర్లుతూ వాహనదారులకు, కాలనీ వాసులకు ఇబ్బందికరంగా తయారైంది. ఉషాముళ్లపూడి రోడ్డులోని మాధవినగర్ సర్కిల్ వద్ద రెండు రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు చుట్టు పక్కల ఉన్న కాలనీ వీధుల్లోని రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఈ కాలనీ వాసులు వర్షం లేకుండానే మురుగు ప్రవాహంతో దుర్గంధం వెదజల్లి ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు దోమలు వృద్ధి చెందుతుండటంతో ప్రజలు నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యపై కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించారు. అయినప్పటికీ వారం రోజుల్లో మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వ్యర్థాలు వేయడం వల్లే..

ఉషాముళ్లపూడి రోడ్డులో రెస్టారెంట్ల వ్యర్థాలను నాలాలో వేయడం వల్ల సమస్య ఏర్పడుతుంది. మురుగు నీరు జామై రోడ్డుపై ప్రవహిస్తోంది. వ్యర్థాలు నాలాలో వేయకుండా రక్షణ సింక్‌లను ఏర్పాటు చేసుకునే విధంగా రెస్టారెంట్ నిర్వాహకులకు నోటీసులు అందజేస్తాం. పరిసర ప్రాంత ప్రజలు కూడా నాలాల్లో చెత్తా చెదారం వేయకుండా సహకరించాలి.

–ప్రశాంతి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్

వృద్ధులకు నేడు వైద్య పరీక్షలు

మోతీనగర్: జాతీయ పోషక ఆహార సంస్థ హైదరాబాద్ ఎన్‌ఐఎన్ ఆధ్వర్యంలో బుధవారం అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 60 సంవత్సరాలు పైబడిన వారికి పరీక్షలు నిర్వహించిన అనంతరం తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పాల్గొనే వారు సంక్షేమ సంఘం వారిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ సికింద్రాబాద్ పర్యవేక్షణ అధికారి కే. మోహన్ రెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు. రూ.2 56 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వీఎన్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి మెదడు వాపు వ్యాధి నివారణ వ్యాక్సిన్


మెడికల్ ఆఫీసర్ డా. శాలిని రెడ్డి

మోతీనగర్: మెదడు వాపు వ్యాధి నివారణకు బుధవారం నుంచి పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వ్యాక్సిన్ వేయనున్నట్లు పర్వత్ నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. శాలిని రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది నెలల శిశువుల నుంచి 15 ఏళ్ల పిల్లలకు మొదట జీరో డోసు టీకా, నెల రోజుల వ్యవధిలో బూస్టర్ టీకా వేయనున్నట్లు తెలిపారు. 15వ తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం 8639162793ను సంప్రదించాలని ఆమె కోరారు.

కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఉదయ్


నియామకపత్రాన్ని అందుకుంటున్న ఉదయ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ కూకట్‌పల్లి జనరల్ సెక్రటరీగా ఉదయ్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ ఉదయ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రైతుల ఖాతాల్లోకి డబ్బులు..

- మేడ్చల్ జిల్లాలో 2,799 మంది రైతులకు రూ.15.56 కోట్లు
- రెండో విడతలో 789 మంది రైతులకు రుణమాఫీ రూ.6.15 కోట్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 లక్షల లోపు పంట రుణాలు ఉన్న 789 మంది రైతుల ఖాతాల్లో రెండో విడత రుణమాఫీ కింద మంగళవారం రూ.6.15 కోట్లు జమ చేసింది. రెండు విడతల్లో కలిపి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,799 మంది రైతులకు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.15.56 కోట్లను చెల్లించింది. ఇప్పటికే లక్షలోపు రుణాలున్న 2,010 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.9.40 కోట్లు జమ చేసింది. వచ్చే నెలలో రూ.2 లక్షలలోపు రుణాలున్న వారికి మాఫీ చేస్తామని ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతులు సంబరాలు చేసుకున్నారు.


పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఇంద్రసేన తదితరులు

మూసాపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల యూసీడీ, పీఓ ఇంద్రసేన, మూసాపేట సీవో మురళి అన్నారు. మంగళవారం మూసాపేటలో ఇంటింటికీ తిరిగి దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమకాటు ద్వారా వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. నీటిలో పెరిగే దోమలను పిల్ల దశలోనే నిర్మూలించాలని వివరించారు. నీటి నిల్వలు, పాడైపోయిన డ్రమ్ములు, సిమెంటు తొట్టెలు, కుండీలు, కూలర్లు, పూలకుండీల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళీ, ఆర్‌పీ శ్రావణి, మహిళా సంఘాల సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

మూసాపేట: మూసాపేటలో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి మైత్రి నగర్‌కు చెందిన లింగారెడ్డి (25) ప్రయివేట్ జాబ్ చేస్తున్నాడు. మహేందర్ (20) జగద్గిరిగుట్టలోని వెంకటేశ్వర నగర్‌లో నివాసం ఉంటూ ఐస్‌క్రీమ్ అమ్ముతుంటాడు. కొమ్ము రాఖేష్(22) జగద్గిరిగుట్టలోని ఇందిరమ్మ హిల్స్‌లో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మూసాపేట మెట్రో స్టేషన్ పక్కన పడావు బడ్డ భవనం ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. 12 ప్యాకెట్లలో సుమారు 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా క్యాంటిన్ పనుల పరిశీలన

సాక్షి,సిటీబ్యూరో: మహిళా క్యాంటిన్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికగుప్తా పరిశీలించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళ స్వయం సహాయక బృందాలతో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటిన్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనుల గురించి ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంటీన్ల నిర్మాణానికి సంబంధించిన పలు సూచనలు చేయటంతో పాటు పాటించాల్సిన పరిశుభ్రత, రుచికరమైన ఆహారాన్ని అందించడం తదితర విషయాలను అదనపు కలెక్టర్ చర్చించారు.

విద్యార్థులకు క్రికెట్ పోటీలు


విజేతలతో ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు

కూకట్‌పల్లి: విజ్ఞ ఇనిస్టిట్యూట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించింది. ఉత్కంఠ భరితంగా మ్యాచ్‌లు కొనసాగాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విజ్ఞ డైరెక్టర్ వెంకట కృష్ణారావు అడ్మిస్ట్రేటివ్ డైరెక్టర్ యామిని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

లులు మాల్‌కు 5స్టార్ హైజినీ రేటింగ్



లులు హైపర్ మార్కెట్

కూకట్‌పల్లి: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి నుంచి కేపీహెచ్‌బీలోని లులు హైపర్ మార్కెట్ 5 స్టార్ హైజినీ రేటింగ్ పొందింది. ఆహార పదార్థాల భద్రతా, పరిశుభ్రతల పట్ల అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకు ఉత్తమ రేటింగ్ లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎంపీ విమేష్, ఫ్రెష్ ఫుడ్ మేనేజర్ లెనిన్ హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి చేశాను గెలిపించండి


ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌రావు తదితరులు

మోతీనగర్: ఎన్నో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేశానని, కాలనీ అధ్యక్షుడిగా తనను గెలిపించాలని శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బొల్లు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. సభ్యుడిగా కొనసాగుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. 4న జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేసి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతదేహం

మూసాపేట: కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మృతదేహాన్ని చూసి అంబులెన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రైవర్లు నియంత్రణ కోల్పోవద్దు


బహుమతులు అందజేస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

జీడిమెట్ల: ఆర్టీసీ డ్రైవర్లు నియంత్రణ కోల్పోకుండా బస్సులు నడపాలని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల డిపోలో మంగళవారం నిర్వహించిన ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 30 ఏళ్లుగా ఒక్క ప్రమాదం జరగకుండా బస్సు నడుపుతున్న డ్రైవర్లు నర్సింహులు, కేఆర్.రెడ్డి, వాసుదేవ్‌ను డిపో మేనేజర్ ఆంజనేయులుతో కలిసి సన్మానించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత చాలా అవసరమన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా 'లక్షే లక్ష్యం' పేరిట నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు.

రిజర్వాయర్ల నిర్వహణ గాలికి..!

- అంతంతమాత్రంగానే మెయింటనెన్స్
- చుట్టూ పెరిగిన కలుపు మొక్కలు, కుంగుతున్న భూమి
- ప్రశ్నార్థకంగా మనుగడ
- పట్టించుకోని అధికారులు


ఫతేనగర్‌కు నీటిని సరఫరా చేసే రిజర్వాయర్ వద్ద కలుపు మొక్కలు

చింతల్: కోట్లాది రూపాయాల నిధులతో నిర్మించిన రిజర్వాయర్ల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికి వదిలేశారు. దీంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి భూమి కుంగడంతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు సదరు నిర్మాణ సంస్థ తూతూ మంత్రంగానే నిర్వహణ పనులు చేపడుతూ వస్తోంది. అక్కడక్కడ మరమ్మతులు, మిగిలిన పనులను మళ్లీ జలమండలి విభాగం ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. కూకట్‌పల్లికి చెందిన రిజర్వాయర్ కుత్బుల్లాపూర్‌లోని షాపూర్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలోని పంప్ హౌస్ పక్కనే నిర్మించారు. ఇక్కడి నుంచే ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు.

నిర్వహణను మరిచిన అధికారులు..

జలమండలి కూకట్‌పల్లి డివిజన్–9 పరిధిలోకి వచ్చే ఫతేనగర్ సెక్షన్‌లో స్థలాభావం కారణంగా షాపూర్ నగర్‌లోని పంప్ హౌస్ పక్కన 6 ఎంఎల్ రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని నుంచే ఫతేనగర్‌లోని పంపింగ్ కేంద్రానికి నిరంతరం నీటిని తరలిస్తూ ఆయా బస్తీలు, కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రిజర్వాయర్ చుట్టుపక్కల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అవి రిజర్వాయర్ నాణ్యతను దెబ్బతీసేలా ఉండడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వాయర్లు నిర్మాణంలో టెండర్లు దక్కించుకున్న పలు కార్పొరేట్ సంస్థలు మెయింటినెన్స్ సుమారు 3 నుంచి 4 ఏళ్ల పాటు చూడాల్సి ఉన్నా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.

కుంగుతున్న రిజర్వాయర్ పరిసర ప్రాంతం..

ఫతేనగర్ రిజర్వాయర్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలం రోజురోజుకు కుంగిపోతోంది. చుట్టూ ప్రహరీ వాల్ నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో భూమి లోపలికి కుంగిపోతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో రిజర్వాయర్ నాణ్యతపై ప్రభావం చూపనున్నది. రిజర్వాయర్ చుట్టూ వేసిన సిమెంట్ బెడ్డు రిటైనింగ్ వాల్ కుంగిపోవడంతో చుట్టుపక్కల నీరు నిలిచిపోతోంది. వీటిపై దృష్టి సారించాల్సిన జలమండలి డివిజన్ అధికారులు, ఫతేనగర్ సెక్షన్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది.

ఛాంబర్ల మూతలు మాయం..!

కుత్బుల్లాపూర్‌కు సరఫరా చేసే 7.5 ఎంఎం రిజర్వాయర్ భారీ నీటి పైపులైన్లను అనుసంధానం చేసే ఛాంబర్లకు ఏర్పాటుచేసిన మూతలు ఇటీవల మాయమయ్యాయి. భారీ పైపులైన్ నుంచి రిజర్వాయర్‌కు అనుసంధానం చేసే మెయిన్ వాల్వ్‌లకు ఏర్పాటుచేసిన అల్యూమినియం మూతల జాలీలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. అదేవిధంగా కైసర్‌నగర్‌లోని రిజర్వాయర్ ప్రధాన డోర్‌కు ఏర్పాటుచేసిన అల్యూమినియం డోర్ సైతం మాయమైంది. అయితే వీటిని ఎవరు ఎత్తుకెళ్లారనేది ప్రశ్నార్థకంగా మారింది. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయంలో 24 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా మూతలు మాయం కావడంపై అధికారులే క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.